# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



దుర్గాదేవీ మండపంలో భక్తులతో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

- హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేద్దాం
- బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు

జమ్మికుంట, అక్టోబర్ 22: 'మీ ఇంటి బిడ్డగా దీవించండి.. అసెంబ్లీకి పంపండి.. సేవచేసే అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా..' అని బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జమ్మికుంట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలి విప్ దుర్గామాత మండపాలను సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. మండపాల కమిటీ సభ్యులు, భక్తులను నేరుగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడారు. దుర్గామాత ఆశీర్వాదం అందరికీ ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజల మధ్యనే తిరుగుతున్నానని, పనిచేసే నాయకుడికే పట్టంగట్టాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలు చైతన్యానికి మారుపేరు అని, గెలిచిన తర్వాత ముఖం చూపని నాయకులు మనకు అవసరం లేదన్నారు. రాష్ట్రంలో మూడోసారి సీఎంగా కేసీఆరే ఉంటారని, హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామన్నారు. అంతకు ముందు పాడి కౌశిక్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఆయా గ్రామాల్లో, పట్టణంలోని పలు కాలనీల్లో విప్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, మండపాల నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను మెచ్చే బీఆర్‌ఎస్‌లో చేరికలు



యువకులకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- కురిక్యాల గ్రామ యువకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

గంగాధర, అక్టోబర్ 22: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బూరుగుపల్లిలోని నివాసంలో ఆదివారం కురిక్యాల గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతంపై మమకారం ఉండదని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, సింగిల్ విండో డైరెక్టర్ బెజ్జంకి కళ్యాణ్, మాజీ ఎంపీటీసీ న్యాతరి శివశంకర్, ఉపసర్పంచ్ కడారి కనకయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మతో మంత్రి గంగుల కమలాకర్



నగరంలోని సంతోష్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

## వైభవంగా సద్దుల బతుకమ్మ

జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. సాయంత్రం కూడళ్లలో పెట్టి మహిళలు, యువతులు ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

-కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 22



8వ డివిజన్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# చేనేత ఉద్యమ నాయకుడి మృతి



వెంకటయ్య(ఫైల్)

రాంనగర్/తెలంగాణచౌక్, అక్టోబర్ 22: పద్మశాలీ సమజోద్ధరణకు అవిరళ కృషి చేసిన వయోవృద్ధులు, చేనేత ఉద్యమ నాయకుడు భీమనాతిని వెంకటయ్య శనివారం రాత్రి గుండె పోటుతో మృతిచెందారు. చేనేత కార్మికులు భీమనాతిని లక్ష్మయ్య-పాపమ్మ దంపుతులకు ఏకైక పుత్రుడిగా చొప్పదండిలో జన్మించారు. ఆయన బాల్యమంతా మహారాష్ట్ర నాందేడ్‌లో గడిపారు. 14వ ఏటా స్వగ్రామానికి చేరుకొని చేనేత వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆయనలోని ప్రావీణ్యాన్ని గ్రహించి, కరీంనగర్‌లోని చేనేత సహకార సంఘానికి ఆవశ్యకమని మెతుకు పెంటప్ప తన సహచరుడిగా నియమించుకున్నారు. కరీంనగర్‌లో స్థిరపడినప్పటికీ తన స్వగ్రామం చొప్పదండిలో చేనేత పారిశ్రామిక సంఘం స్థాపించారు. కరీంనగర్ జిల్లాలో స్థాపించిన పద్మశాలీ సంక్షేమ ట్రస్టులో మొట్టమొదటి ట్రస్టీగా వ్యవహరించి, పేద ప్రతిభావంతులైన గ్రామీణ పద్మశాలీల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయన కుమారులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ఎస్ఈగా సత్యనారాయణ, శాతవాహన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా భద్రయ్య పని చేశారు. మిగతా కుమారులు శ్రీనివాస్ జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ ఎస్ఈగా, డాక్టర్ బీ శంకర్ జగిత్యాలలో ఎండీ ఫిజీషియన్‌గా, డాక్టర్ వేణుగోపాల్ అమెరికాలో కిడ్నీ స్పెషలిస్టుగా సేవలందిస్తున్నారు. వెంకటయ్య మృతి పట్ల పద్మశాలీ సంఘం సభ్యులు సంతాపం తెలిపారు.

## గంజాయి నిందితుల పట్టివేత

రాంనగర్, అక్టోబర్ 22: నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం ముందు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పట్టుకొని తనిఖీ చేయగా, వారి వద్ద గ్రాముల గంజాయి దొరికింది. వారిని విచారించగా కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన ముఖేష్ కుమార్, మానకొండూర్ మండలం కొండపల్కలకు చెందిన ఎరవేణి విజయ్ అని గుర్తించారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల గంజాయి రూ. 3,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.



నగరంలోని బృందావన్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కరీంనగర్‌రూరల్: మొగ్దుంపూర్‌లో బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్



కొత్తపల్లి: పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో..



కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్ లో..



కరీంనగర్‌రూరల్: నగునూర్‌లో..



కరీంనగర్‌రూరల్: గోపాల్‌పూర్ హనుమాన్ ఆలయం వద్ద..



కరీంనగర్‌రూరల్: నగునూర్‌లో బతుకమ్మలతో వస్తున్న గ్రామస్తులు